# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ పొరుగు దేశాలతో భారతదేశం ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంచుకోవడమే లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.

❖ మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పిలుపు ఇచ్చారు.

❖ సముద్ర రంగంలో సురక్షితమైన, సమగ్రమైన వాతావరణం కోసం పొరుగుదేశాలతో కలిసి పని చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు.

❖ తమిళనాడు పర్యటనలో భాగంగా రైల్వే, రోడ్డు పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోడి రేపు దేశానికి అంకితం చేయనున్నారు.

❖ వక్ఫ్ ఆస్తులను రద్దు చేయబోమని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

======================

పొరుగు దేశాలతో భారతదేశం ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంచుకోవడమే లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి కొలంబోలోని అధ్యక్ష సచివాలయంలో అధ్యక్షులు అనుర దిసనాయకేతో కీలక సమావేశం ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పొరుగుదేశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం అన్నది భారతదేశం విధానమని తెలిపారు. భారతదేశ భద్రతకు ప్రాంతీయ స్థిరత్వానికి హాని కలిగించే విధంగా శ్రీలంక తన భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి అనుమతించదని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

కాగా, భారతదేశం శ్రీలంక మధ్య భాగస్వామ్యాలను పెంపొందించడం అనే ఉమ్మడి దృక్పథానికి కట్టుబడి ఈ చర్చలు జరిగాయి. ఇరు దేశాల మధ్య శాశ్వత స్నేహానికి ప్రతీకగా శ్రీలంక ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మిత్ర విభూషణ్ అవార్డుతో సత్కరించింది.

======================

సముద్ర రంగంలో సురక్షితమైన, సమగ్రమైన వాతావరణం కోసం పొరుగువారితో కలిసి పనిచేయవలసిన అవసరం ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కర్ణాటకలోని కార్వార్ నావల్ బేస్‌లో హిందూ మహాసముద్ర నౌక SAGAR ఐఎన్ఎస్ సునయనను ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సముద్ర రంగంలో శాంతి, శ్రేయస్సు సామూహిక భద్రత అన్నది భారతదేశం కోరుకుంటోందని చెప్పారు. అత్యాధునిక నౌకలు, ఆయుధాలు పరికరాలు బాగా శిక్షణ పొందిన నావికులతో భారత నావికాదళం పటిష్టంగా ఉందని గుర్తు చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని ఇతర దేశాలతో సోదరభావం, స్నేహపూర్వక వైఖరిని భారత దేశం ఆకాంక్షిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు.

======================

మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పిలుపు ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడలో ఈ రోజు జరిగిన బస్తర్ పాండుం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాంబు పేలుళ్లు కాలం గడిచిపోయిందని, బస్తర్ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలని, తల్లుల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, గిరిజన యువత పోషకాహార లోపంతో బాధపడకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ విధానమని అన్నారు. మావోయిస్టులు లొంగిపోయేలా చేసే ఏ గ్రామానికైనా కోటి రూపాయల అభివృద్ధి నిధిని ఇస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించిన సంగతిని అమిత్ షా గుర్తు చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

వక్ఫ్‌గా నమోదు చేయబడిన ఏ ఆస్తిని రద్దు చేయబోమని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో 2025 వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించిన అపోహలను తొలగించింది. 1995 వక్ఫ్ చట్టం ప్రారంభం కావడానికి ముందు 1995 వక్ఫ్ చట్టం కింద ఉన్న ఆస్తులు ఏవీ రద్దు కావని పేర్కొంది. ఒక ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించిన తర్వాత అది శాశ్వతంగా అలాగే ఉంటుందని వెల్లడించింది. మెరుగైన నిర్వహణ పారదర్శకత కోసం మాత్రమే ఈ బిల్లులో నియమాలను రూపొందించారని తెలిపింది. కాగా, ప్రభుత్వ ఆస్తిని వక్ఫ్‌గా తప్పుగా వర్గీకరించారా అని సమీక్షించడానికి, ధృవీకరించడానికి జిల్లా కలెక్టర్ స్థాయి కంటే ఎక్కువ ఉన్న అధికారికి బిల్లు అధికారం ఇస్తుందని వివరించింది. అయితే చట్టబద్ధంగా ప్రకటించిన వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ఇది ఏ అధికారం ఇవ్వదని స్పష్టం చేసింది.

విరామం

======================

భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయనకు దేశ ప్రముఖులు ఈ రోజు ఘన నివాళి అర్పించారు. భారతదేశానికి బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చాలా గొప్పవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జగ్జీవన్ రామ్ కుమార్తె, లోకసభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ఢిల్లీలోని సమతాస్థల్ లో ఆయన స్మారక స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ సామాజిక మాధ్యమం ద్వారా ఆయనను స్మరించుకున్నారు.

=======================

తమిళనాడు రాష్ట్ర పర్యటనలో భాగంగా సుమారు 8 వేల 300 కోట్ల రూపాయల విలువ చేసే రైల్వే, రోడ్డు పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోడి రేపు ప్రారంభించి దేశానికి అంకితం చేస్తారు. రామేశ్వరం వద్ద సముద్రంలో నిర్మించిన కొత్త పంబన్ రైల్వే బ్రిడ్జ్‌తో పాటు మరికొన్ని ప్రాజెక్టులను ప్రారంభిస్తారని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ సందర్భంగా పాత్రికేయులకు తెలియజేస్తూ..

(వాయిస్ 21 సెకన్లు)

అలాగే, రామేశ్వరం - తాంబరం మధ్య నడిచే కొత్త రైలును కూడా ప్రారంభించనున్నారు. కొత్త వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జ్ నుంచి వెళ్లే కోస్టు గార్డు షిప్‌కు కూడా ప్రధానమంత్రి పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు.

=======================

శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ శ్రీరాముడి జన్మదినోత్సవాన్ని గుర్తుకు తెస్తుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. శ్రీరాముడి జీవిత ప్రయాణం సత్యం, ధర్మం నీతి మార్గాన్ని అనుసరించడానికి అందరికీ ప్రేరణగా నిలుస్తుందని ఆమె వెల్లడించారు. ఈ పండుగ మానవాళికి అంకితభావం నిబద్ధతతో సేవ చేయాలనే సందేశాన్ని అందిస్తుందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

=======================

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. రేపు శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో బాల రాముడికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారని ఆలయ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సూర్య కిరణాలు దాదాపు నాలుగు నిమిషాల పాటు బాల రాముడి నుదుటిపై పడనున్నాయని చెప్పారు. కాగా, శ్రీరామ నవమి రోజు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి 10 గంటల 30 నిమిషాల వరకు అభిషేకం, ఉదయం 10 గంటల 40 నిమిషాల నుంచి 11 గంటల 45 నిమిషాల మధ్య ఆరాధన కార్యక్రమాలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ సాయంత్రం కొలంబోలోని భారత శాంతి పరిరక్షక దళ స్మారక చిహ్నం (ఐపికెఎఫ్) వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. 2015లో తొలిసారిగా ద్వీపాన్ని సందర్శించినప్పుడు ప్రధానమంత్రి ఈ స్మారక చిహ్నాన్ని సందర్శించారు. 1987 - 1990 మధ్య శాంతిని పరిరక్షించడానికి శ్రీలంకలో భారత శాంతి పరిరక్షక దళం మోహరించింది. ఆనాటి వారి త్యాగానికి గురుతుగా ఐపికెఎఫ్ స్మారక చిహ్నం నిలిచింది. యుద్ధంలో మరణించిన 3 వేల మందికి పైగా సైనికులు, అలాగే గాయపడిన 1,169 మంది భారత దళాల సిబ్బంది సహకారాన్ని స్మరించుకోవడానికి శ్రీలంక ప్రభుత్వం 2008లో ఈ స్మారక చిహ్నాన్ని నిర్మించింది.

=======================
=======================